క్లుప్తంగా

108లో గర్భిణి ప్రసవం



కమలాపూర్: పురుటినొప్పులతో బాధపడుతున్న మహిళను ఆస్పత్రికి తరలించేందుకు యత్నించగా నొప్పులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో 108 సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి నార్మల్ డెలివరీ చేశారు. దీంతో ఆ మహిళ పండంటి బాబుకు జన్మనిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులకు ఉత్తర ప్రదేశ్ నుంచి కొందరు వలస కూలీలు ఇచ్చారు. అందులో అంజలి అనే గర్భిణికి బుధవారం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేయగా అక్కడి చేరుకున్నారు. అప్పటికే అంజలికి నొప్పులు ఎక్కువడంతో 108 సిబ్బంది ఈఎంటీ శ్రీనివాస్, పైలట్ మండ కేదారి, ఆశ కార్యకర్త కవిత సహాయంతో ఈఆర్‌సీపీ డాక్టర్ నవనీత్ సూచనల మేరకు అక్కడే నార్మల్ డెలివరీ చేయగా ఆమె పండంటి బాబుకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీ, బిడ్డలను మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించామని, తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



సుమంత్

ధర్మసాగర్: ఈ నెల 14వ తేదీన హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్ 17 బాలుర వాలీబాల్ ఎంపికల్లో మండలంలోని పెద్దపెండ్యాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి ఆకారపు సుమంత్‌రాజ్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బత్తిని రాజేందర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 వ తేదీన నుంచి 21 వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని రాజాపూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సుమంత్‌రాజ్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్దపెండ్యాల మాజీ సర్పంచ్ తోట స్రవంతినాగరాజు అభినందించి ఆర్థిక సాయం అందించారు. పీఈటీ సుధాకర్, స్థానిక సర్పంచ్ ఆకారపు అన్నమ్మ, ఎంపీటీసీ ఆకారపు నాగయ్య, ఉప సర్పంచ్ శివాకర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ మామిడాల కిషోర్, మన ఊరు–మన బడి సభ్యులు సోమ అమర్నాథ్, బత్తిని రాజ్‌కుమార్, పీఎస్ హెచ్‌ఎం చాడ మల్లారెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బాధితులకు పరామర్శ



శాయంపేట : మండలంలోని గోవిందాపూర్‌కు చెందిన పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కుడ్లె సుధాకర్‌రావు సోదరుడు కుడ్లె అంకూస్‌రావు మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. కాగా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, జీఎంఆర్ఎం ట్రస్ట్ జనరల్ సెక్రటరీ గండ్ర గౌతంరెడ్డి బుధవారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీ వేణుగోపాలప్రసాద్, సర్పంచ్ శ్రీనివాస్, మండల మాజీ అధ్యక్షుడు గుర్రం రవీందర్, గ్రామ అధ్యక్షుడు పైడి, సర్పంచ్ శంకర్‌రావు, కుమారస్వామి, నాయకులు కిష్టయ్య, రమేష్, శ్రావణ్, లక్ష్మణ్, మహేష్, రాజు, రాజయ్య పాల్గొన్నారు.

అంతిమ వీడ్కోలు

పరకాల: గుండెపోటుతో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రెండ్ల సమ్మయ్య అంత్యక్రియలను బుధవారం నిర్వహించారు. అంత్యక్రియలకు మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ దంపతులు హాజరయ్యారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు.

మద్యం పట్టివేత

నడికూడ: అక్రమంగా నిల్వ ఉంచిన రూ.12,420 విలువ గల మద్యం పట్టుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. మండంలోని కౌకొండ గ్రామానికి చెందిన గట్టు శ్రీనివాస్‌గౌడ్ అనుమతులు లేకుండా ఐఎంఎఫ్ లిక్కర్ అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో బుధవారం అతని ఇంట్లో తనిఖీలు చేయగా రెండు పెట్టెల్లో కింగ్ ఫిషర్ బీర్లు, వివిధ రకాల మద్యం బాటిళ్లు లభించినట్లు పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: హనుమకొండ టీబీ ఆస్పత్రి పరిధిలోని 11కేవీ మరమ్మతుల్లో భాగంగా గురువారం ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం చోటు కలుగనుందని డీఈఈ హనుమకొండ టౌన్ సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ పీఎస్, విజయ్ గణపతినగర్, విద్యారణ్యపురి, సీఆర్పీఎఫ్ క్యాంప్, పలివేల్పుల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

డిజిటల్ చెల్లింపులపై దృష్టి సారించాలి

- విద్యుత్ శాఖ అధికారుల అవగాహన
- కరపత్రాలు ఆవిష్కరణ



కమలాపూర్: ఆన్‌లైన్ విద్యుత్ బిల్లు చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్న ఏడీ అశోక్

కమలాపూర్: డిజిటల్ చెల్లింపులపై దృష్టి సారించాలని విద్యుత్ శాఖ ప్రత్యేకాధికారి, ఏడీ అశోక్ అన్నారు. ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపులు సులభతరం, సురక్షితమని పేర్కొన్నారు. కమలాపూర్, ఉప్పల్, శనిగరం, మాదన్నపేట, శ్రీరాములపల్లి, అంబాల, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో బుధవారం టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీఎస్ఎన్‌పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇంటి వద్ద నుంచే బిల్ డెస్క్, పేటీఎం, టీ–వ్యాలెట్, ఫోన్ పే, గూగుల్ పే, అమేజాన్ పే యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. తద్వారా వినియోగదారులకు సమయం ఆదా అవుతుందని, క్యూ లైన్లో నిలబడాల్సిన అవసరం ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు నగదు రహిత చెల్లింపులతో సకాలంలో బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపులకు సంబంధించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఏడీ ఆపరేషన్స్ కమలాపూర్ ఏడీ పైడయ్య, ఏఈలు రాములు, సంపత్‌రెడ్డి, సబ్ ఇంజనీర్ సుదర్శన్, లైన్ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రావు, ఏఎల్ఎం స్వామి, జేఎల్ఎం సంతోష్, అన్‌మ్యాన్డ్ వర్కర్లు వెంకటేష్, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : ప్రతీనెల విద్యుత్ బిల్లులను డిజిటల్ రూపంలో చెల్లించేందుకు వీలుందని విద్యుత్‌శాఖ ఏడీ దేవేందర్‌రావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరూ స్మార్ట్‌ఫోన్‌లను వినియోగిస్తున్నారని తెలిపారు. గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా ప్రతి నెల విద్యుత్ బిల్లులను చెల్లించుకోవచ్చని సూచించారు. నగదు రూపంలో చెల్లించేందుకు ఆఫీసుకు రావాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమణ, లైన్ ఇన్‌స్పెక్టర్ దామోదర్, లైన్‌మెన్ సంతోష్, జూనియర్ లైన్‌మెన్ విష్ణు పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల: పట్టణ ప్రాంత ప్రజలు డిజిటల్ పేమెంట్ల యాప్‌ను వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ ఏడీఈలు జగదీశ్‌బాబు, దేవేందర్ కోరారు. పట్టణంలోని విద్యుత్ శాఖ వినియోగదారుల కేంద్రం ఆవరణంలో డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ శాఖ అనుమతించిన అనేక యాప్‌ల ద్వారా డిజిటల్ పేమెంట్స్ చేయవచ్చని వినియోగదారులకు సూచించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ జి. సత్యనారాయణ, ఏఏఓ శ్రీనివాసులు, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, లైన్‌మెన్‌లు టి.చేరాలు, సోమ్లా, ఈ.శ్రీనివాస్,టి.సోమయ్య, అబ్దుల్లా ఖాదర్, జేఎల్ఎం జి.అశోక్ పాల్గొన్నారు.

దామెరలో..

దామెర: నగదు రహిత విద్యుత్ చెల్లింపులపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ దేవేందర్ అన్నారు. మండల కేంద్రంతో పాటు ఊరుగొండ, పసరగొండ, తక్కళ్లపహాడ్, కోగిల్వాయి గ్రామాల్లో విద్యుత్ బిల్లుల డిజిటల్ లేదా ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించి 62 మంది వినియోగదారులకు వద్ద నుంచి ఆన్‌లైన్ చెల్లింపులు జరిపించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడారు. నగదు రహిత చెల్లింపులతో వినియోగదారులకు సమయం ఆదా కానుందని అన్నారు. ఏ సమయంలోనైనా ఎక్కడి నుంచైనా బిల్లు చెల్లించుకోవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ కార్యాలయాల కౌంటర్ల ముందు బారులుతీరే ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చని వెల్లడించారు. ఈఆర్‌ఓ ఏఏఓ శ్రీనివాస్, ఏఈ గుర్రం రమేష్, సబ్ ఇంజనీర్ సీహెచ్. చందన, లైన్ ఇన్‌స్పెక్టర్లు రవీందర్, వేణుగోపాల్, లైన్‌మెన్లు మనోహర్, సురేష్, రవి, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, సతీష్‌తో పాటు ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దామెర : అవగాహన కల్పిస్తున్న ఏడీఈ, ఏఈ



శాయంపేట : అవగాహన కల్పిస్తున్న అధికారులు



పరకాల: కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఘనంగా అట్ల బతుకమ్మ వేడుకలు



పరకాల: బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న చల్లా జ్యోతి



ధర్మసాగర్: దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్



ఆత్మకూరు : వేడుకల్లో తహసీల్దార్, ప్రిన్సిపాల్



పరకాల : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

పరకాల: పట్టణంతో పాటు పలు గ్రామాల్లో అట్లబతుకమ్మ వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. నాగారంలో అట్ల బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సతీమణి చల్లా జ్యోతి పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మను పేర్చారు. అనంతరం వారితో కలిసి బతుకమ్మలతో ఊరేగింపు చేపట్టి బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. అదే విధంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి అధ్యాపకులు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ఎస్వీ కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించగా పండుగ వాతవరణం నెలకొంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సంపత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి ఎండీ సర్దార్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మసాగర్ : తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని ప్రముఖ రచయిత, కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాల్లో భాగంగా బుధవారం ప్రముఖ సామాజిక కార్యశీలి, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత అందించిన రూ. 50 వేల విలువ గల దుస్తులను విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈచ్ వన్ రీచ్ వన్ ఉద్యమాన్ని సృష్టించి ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థుల లక్ష్యాల సాధనకు సహకారం అందిస్తున్న సూరేపల్లి సుజాతను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు. ఈ క్రమంలో విద్యార్థులు స్వయంగా పాటలు పాడుతూ చేసిన నృత్యాలు అలరించాయి. ఎన్ఎస్ఎస్ అధికారి జ్యోతి, అధ్యాపకులు మంజుల, కనకయ్య, కర్ణాకర్, బాబురావు, రాములు, సదానందం, వెంకట్, ప్రభాకర్, గోపాలకృష్ణ, ఆజమ్, గణేష్, స్వర్ణ పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, ప్రిన్సిపాల్ బీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

రూ.94,600 నగదు పట్టివేత



వాహన తనిఖీల్లో పట్టుకున్న నగదు

కమలాపూర్: మండలంలోని అంబాల గ్రామ శివారులో బుధవారం సాయంత్రం చేపట్టిన వాహన తనఖీల్లో ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.94,600 నగదును పట్టుకున్నట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మేడిపెల్లి మండలానికి చెందిన తూర్పాటి శేఖర్ బొలెరో వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.94,600 తలిస్తుండగా వాహన తనిఖీల్లో పట్టుబడినట్లు తెలిపారు. దీంతో ఎఫ్ఎస్‌టీ టీంకు నగదును అప్పగించినట్లు పేర్కొన్నారు. కాగా నగదుకు సంబంధించిన సరైన ఆధారాలను సదరు వ్యక్తి చూపాడని, దీంతో డబ్బులు అతనికిచ్చి పంపించినట్లు ఎఫ్ఎస్‌టీ అధికారి సాంబరాజు తెలిపారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారిపై ఎస్సై ముత్యం రాజేందర్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ముందస్తు చర్యల్లో భాగంగా రహదారిపై వాహన తనిఖీలు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అధిక మొత్తం నగదు తరలించే వ్యక్తులు తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి



పూజల్లో పాల్గొన్న ఎంపీపీ మార్నేని మధుమతి

ఐనవోలు: దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఎంపీపీ మార్నేని మధుమతి కోరారు. మండల కేంద్రంలో యూత్ ఆధ్వర్యంలో తొలిసారిగా దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలను చేపడుతున్నారు. బుధవారం అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించి విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో దుర్గామాత మండపాన్ని ఏర్పాటు చేసి నవరాత్రులు నిర్వహిస్తున్న యువకులను అభినందించారు. నిర్వాహకులు దుర్గామాత మాలలు ధరించారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీపీ స్వప్న తెలిపారు. సభ్యులు హాజరుగాకపోవడంతో కోరం లేక వాయిదా పడినట్లు ప్రకటించారు.

'బాలసాని' బలగం



కమలాపూర్: మండల కేంద్రంలో నాలుగు తరాలకు చెందిన బాలసాని కుటుంబ సభ్యులు ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. నేటి సాంకేతిక యుగంలో రక్త సంబంధాలు, మమతానురాగాలు అడుగంటి పోతున్న తరుణంలో మనుషుల మధ్య, మనసుల మధ్య దూరాలను చెరిపేస్తూ బాలసాని వర్గానికి చెందిన సుమారు 200 మంది వంగపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల మామిడి తోటలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సవాల మధ్య ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనం తమలో కొత్త అనుభూతిని మిగిల్చిందని, చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా నాలుగు తరాలకు చెందిన వారమంతా ఒకే చోట కలుసుకోవడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. కుమారస్వామి, రమేష్, భిక్షపతి, పెద్ద రవి, చిన్న రవి, శ్రీనివాస్, దేవేందర్, రవీందర్, కొమురెల్లి, మహిళలు పాల్గొన్నారు.

కూష్మాండ అలంకరణలో దుర్గామాత



ఆత్మకూరు: మండల కేంద్రంలోని పోచమ్మ సెంటర్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం దుర్గామాత కూష్మాండ అలంకరణంలో భక్తులకు దర్శనమిచ్చింది. శ్రీవేణుగోపాలస్వామి భజనమండలి సభ్యులు భజన కీర్తనలు ఆలపించారు. అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి, భక్తులు, ప్రత్యేక పూజలు చేశారు.

నాటిన మొక్కలన్నింటినీ సంరక్షించాలి

- ఎంపీడీఓ గుండె బాబు



క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలన్నింటికీ ప్రతిరోజు నీరు పట్టి సంరక్షించాలని ఎంపీడీఓ గుండె బాబు సిబ్బందిని ఆదేశించారు. ఎంపీఓ విమలతో కలిసి బుధవారం ఆయన మండలంలోని కానిపర్తి, శంభునిపల్లి, దేశరాజుపల్లి గ్రామాల్లో పర్యటించి నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలతో పాటు వివిధ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. 48 గంటల్లో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గల నర్సరీలను శుభ్రం చేసి మొక్కలను ఎత్తుల ప్రకారం క్రమ పద్ధతిలో అమర్చాలన్నారు. లేని పక్షంలో ఆ పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని శుభ్రం చేసి ఆ గ్రామ ప్రజలు ఉపయోగించుకునే విధంగా చూడాలన్నారు. రోడ్లు, డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, ఉపాధి హామీ కూలీలకు ప్రతిరోజు పని కల్పించాలని అన్నారు. ఎన్నికల నియమావళికి లోబడి రాజకీయ పార్టీల వాల్‌పోస్టర్లు, వాల్ పెయింటింగ్‌లను తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రమేష్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపక్షాల డిపాజిట్ గల్లంతు ఖాయం

- ఎమ్మెల్యే అరూరి రమేష్



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రమేష్

ఐనవోలు: బీఆర్ఎస్ పార్టీకి వస్తున్న అపూర్వ స్పందన చూస్తుంటే వర్ధన్నపేట నియోజకవర్గంలో ప్రతిపక్షాల డిపాజిట్లు కూడా వచ్చేలా లేవని వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మేరుగు రవీందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు హనుమకొండలోని ఆయన నివాసంలో బుధవారం పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి నాయకులు బీఆర్ఎస్‌లో చేరడం సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ప్రజలు తమవెంటే ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఇల్లందుల కొమురయ్య, కట్కూరు మధుకర్, తాళ్లపెల్లి మనోహర్ జోషి, జీడీ స్వామి, కట్కూరి రాజేష్, పృథ్వి, నిరంజన్, కుమారస్వామి, కుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్కూరి రాజమణి, బీఆర్ఎస్ నాయకులు పిట్టల సుధీర్, సత్తిరెడ్డి, శేఖర్, శ్యాం, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు బాగుపడాలంటే కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

ఆత్మకూరు: రాష్ట్రంలోని బీసీ కులస్తులు బాగుపడాలంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పి గద్దె దించాలని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన ఓబీసీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అత్యధిక జనాభా కలిగిన బీసీలు ఐకమత్యంతో ఉంటే అధికారం ఖాయమన్నారు. రానున్న రోజుల్లో అసెంబ్లీలో 50శాతం సీట్లు బీసీలవేనని, బీసీ బిడ్డనే ముఖ్యమంత్రి అవుతాడని అన్నారు. పరకాల ఎమ్మెల్యేగా బీసీ నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ వెంకటనారాయణ, కాళీప్రసాద్, రాష్ట్ర నాయకుడు రాజయ్యయాదవ్, ముదిరాజ్ సంఘం నాయకులు డాక్టర్ జగదీశ్వర్‌ప్రసాద్, బయ్య పైడి, యాదవసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాబు, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మల్లయ్య, రజకసంఘం నాయకుడు డాక్టర్ మధుచందర్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు శ్రావణ్, గట్టు వేణుగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ఓబీసీ సెల్ జిల్లా నాయకుడు సముద్రాల రవి, గౌడసంఘం నాయకుడు కక్కెర్ల సాంబయ్య పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో తుల సంక్రమణ పూజలు



ఒగ్గు పూజ చేస్తున్న పూజారులు



హోమం చేస్తున్న అర్చకులు, పండితులు

ఐనవోలు: సూర్యుడు తులారాశిలోకి ప్రవేశించిన సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో తులసంక్రమణ ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామివారి నిత్య కైంకర్యాలు నిర్వహించిన అనంతరం అర్చకులు సంక్రమణ పూజలతో పాటు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం చేశారు. గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మ సమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం శైవాగమోక్తంగా జరిపించారు. అలాగే ఒగ్గు పూజారులు గర్భాలయం ఎదుట మహా మండపంలో నజరు పట్నం వేసి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని మల్లన్నను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పారాయణ దారు గట్టు పురుషోత్తమ శర్మ, ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి



సామాజిక తనిఖీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శ్రీనివాసకుమార్

ఆత్మకూరు: ఎన్ఆర్ ఈజీఎస్ రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని డీఆర్‌డీఓ శ్రీనివాసకుమార్ సూచించారు. మండలంలో ఎస్ఆర్‌పీ నర్సయ్య ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక తనిఖీ ఇన్‌హౌజ్ సమీక్ష మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగింది. తనిఖీ బృందం నివేదికను అధికారులకు అందించారు. టెక్నికల్ అసిస్టెంట్లు రూ.10,530, ఈసీ రూ.1,581, పీఆర్ ఏఈ నుంచి రూ.వేయ్యి నగదు రికవరీ చేయాలని డీఆర్‌డీఓకు నివేదించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా ఈజీఎస్ పనులను కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, ఏఈ లత తదితరులు పాల్గొన్నారు.